క్లుప్తంగా

త్రిపురారం తహసీల్దార్‌గా ప్రమీల బాధ్యతల స్వీకరణ



గాజుల ప్రమీల, త్రిపురారం

త్రిపురారం: మండల తహసీల్దార్‌గా గాజుల ప్రమీల సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన కేసీ ప్రమీల నాగర్‌కర్నూల్ జిల్లాకు బదిలీ కాగా.. ఆమె స్థానంలో జయశ్రీ బాధ్యతలు చేపట్టి వారం రోజులు తర్వాత అనుముల మండలానికి బదిలీపై వెళ్లారు. కాగా నారాయణపేట జిల్లాలోని దామరగిద్ద తహసీల్దార్‌గా పనిచేస్తున్న గాజుల ప్రమీల త్రిపురారం మండలానికి నూతన తహసీల్దార్‌గా వచ్చి బాధ్యతలు స్వీకరించారు.

కొండమల్లేపల్లి తహసీల్దార్‌గా దివ్యారెడ్డి



దివ్యారెడ్డి, కొండమల్లేపల్లి

కొండమల్లేపల్లి: మండల నూతన తహసీల్దార్‌గా జి. దివ్యారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె మేడ్చల్ జిల్లాలోని కీసర ఆర్డీఓ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడకు తహసీల్దార్‌గా వచ్చారు. నూతన తహసీల్దార్‌ను రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు కేసాని లింగారెడ్డి, జెడ్పీటీసీ తనయుడు పస్నూరి యుగంధర్‌రెడ్డి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. కలిశారు.

బీసీలను మరోసారి మోసం చేసిన కేసీఆర్

మిర్యాలగూడ టౌన్: వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు గాను సీఎం కేసీఆర్ ప్రకటించిన టీఆర్ఎస్ జాబితాలో సిట్టింగ్‌లకే టికెట్లు ఇచ్చి బీసీలను మరోసారి మోసం చేశారని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ ఆరోపించారు. సోమవారం మిర్యాలగూడ పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జనాభా దామాషా ప్రకారం బీసీలకు 60 సీట్లు కేటాయించకుండా మళ్లీ సిట్టింగ్‌లకు సీట్లు కేటాయించడాన్ని చూస్తే బీసీలపై కేసీఆర్‌కు ఎంత వివక్ష ఉందో అర్థమవుతుందన్నారు. కేసీఆర్ మోసాన్ని తిప్పికొట్టేందుకు బీసీలు సిద్ధం కావాలని అన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థులను ఓడించి బీసీల సత్తా ఏమిటో తెలియజేయాలన్నారు.

అభయాంజనేయస్వామికి జలాభిషేకం

అడవిదేవులపల్లి: మండలంలోని చాంప్లాతండా, గోన్యాతండా గ్రామపంచాయతీల మధ్యలో గల అభయాంజనేయ స్వామి ఆయలంలో సోమవారం స్వామివారికి ఆయా గ్రామస్తులు కృష్ణానది నుంచి కాలినడకన 51 బిందెలతో జలాన్ని తీసుకొచ్చి అభిషేకం చేశారు. వర్షాలు సంవృద్ధిగా పడి పంటలు పండాలని ప్రతి ఏడాది స్వామివారికి కృష్ణా జలంతో అభిషేకాలు నిర్వహించనున్నట్లు ఆయా గ్రామాల ప్రజలు తెలిపారు.

రేపు స్పాట్ కౌన్సెలింగ్

కొండమల్లేపల్లి: మండల కేంద్రంలోని ఎస్టీ గురుకుల పాఠశాల, కళాశాలలో ఎంపీసీ గ్రూప్‌లో మిగిలిపోయిన సీట్ల కోసం బుధవారం స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి పాసైన విద్యార్థినులు బుధవారం ఉదయం 10గంటలకు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలు, ఒక సెట్ జిరాక్స్‌లతో పాఠశాలలో కౌన్సిలింగ్‌కు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 8333925377, 9177726501 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

కౌన్సెలింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

మిర్యాలగూడ అర్బన్: అవంతీపురం గిరిజన గురుకుల బాలుర కళాశాలలో బైపీసీ గ్రూప్‌లో ఉన్న 14 ఖాళీలకు, సీఈసీ గ్రూప్‌లో 14 ఖాళీల భర్తీకి ఈ నెల 24న గిరిజన బాలుర విద్యార్థులకు స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కోడుమూరి సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు తమ ఒరిజనల్ సర్టిఫికెట్‌లతో పాటు మూడు సెట్ల జిరాక్స్‌లు, నాలుగు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు తీసుకుని ఉదయం 11గంటలకు కళాశాలలో సంప్రదించాలని సూచించారు. స్పాట్ కౌన్సెలింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

ఎన్నికల నిర్వహణపై విద్యార్థులకు అవగాహన



కృష్ణవేణి స్కూల్‌లో నిర్వహించిన మాక్ పోలింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు

హాలియా: పట్టణంలోని కృష్ణవేణి పాఠశాలలో సోమవారం విద్యార్థులకు ఎన్నికల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బాక్స్‌ల్లో విద్యార్థులు ఓటు వేసి అవగాహన పెంచుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ నిమ్మల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. పాఠశాల స్థాయిలో ఎన్నికలు నిర్వహించడం ద్వారా విద్యార్థులకు ఎన్నికలు, ఓటు హక్కు వినియోగించుకోవడం వంటి విషయాలపై అవగాహన కల్గుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కరెంటు కట్.. నిలిచిన సేవలు

- నెల వ్యవధిలో రెండోసారి చందంపేట తహసీల్దార్ కార్యాలయానికి విద్యుత్ సరఫరా నిలిపివేత
- కరెంటు బిల్లు బకాయి ఉండడంతో నిలిపివేసిన విద్యుత్ అధికారులు
- భూముల రిజిస్ట్రేషన్, ధరణి సేవలు నిలిచిపోవడంతో ఇబ్బందులు

చందంపేట: మండలంలోని తహసీల్దార్ కార్యాలయానికి విద్యుత్ శాఖ అధికారులు నెల వ్యవధిలో రెండోసారి విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. సోమవారం ఉదయం విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో సేవలు అందక మండల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ధరణి, భూముల రిజిస్ట్రేషన్ సేవలు నిలిచిపోవడంతో పాటు కుల, ఆదాయ తదితర ధ్రువీకరణ పత్రాలు జారీకాకపోవడంతో ప్రజలు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. గతంలో విద్యుత్ బకాయి రూ.23వేలకు గాను రూ.14వేలు చెల్లించగా ఇంకా రూ.9వేలు బకాయి ఉన్నట్లు తెలిసింది. ఏదేమైనా ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సేవలు, ధ్రువ పత్రాలు జారీ చేయాల్సిన తహసీల్దార్ కార్యాలయానికి కరెంటు సరఫరా నిలిపివేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి విద్యుత్‌ను పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



చందంపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద పడిగాపులు కాస్తున్న ప్రజలు

తహసీల్దార్‌ను నియమించాలని ధర్నా



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

పెద్దవూర: మండల తహసీల్దార్ బదిలీపై వెళ్లి ఇరవై రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు మండలానికి నూతన తహసీల్దార్ రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారంటూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం పెద్దవూర మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి దుబ్బ రామచంద్రయ్య మాట్లాడుతూ.. ఇక్కడ పనిచేసే తహసీల్దార్ బదిలీపై వెళ్లగా, నాయబ్ తహసీల్దార్ పదోన్నతిపై వేరే జిల్లాకు బదిలీ అయ్యారని, వారి స్థానంలో ఇప్పటివరకు నూతన అధికారులు రాలేదని, దీంతో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం విద్యార్థులు, రిజిస్ట్రేషన్‌ల కోసం స్లాట్ బుక్ చేసుకున్నా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే నూతన తహసీల్దార్, నాయబ్ తహసీల్దార్‌ను పెద్దవూర మండలానికి కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మల్లయ్య, ఏసుదానం, వెంకటేశ్వర్లు, నాగార్జున, ఏడుకొండలు, రవి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం



దేవరకొండ: మాట్లాడుతున్న ఔరాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రభు చౌహాన్



వేములపల్లి: మాట్లాడుతున్న ఘజియాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే అతుల్ గార్గే

దేవరకొండ: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని కర్ణాటక మాజీ మంత్రి, ఔరాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రభు చౌహాన్ ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ప్రవాస్ యోజనలో భాగంగా సోమవారం దేవరకొండలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో దేవరకొండ నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగురవేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. అనంతరం సోషల్ మీడియా కన్వీనర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని వారికి దిశానిర్దేశం చేశారు. దేవరకొండ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ ఏటి.కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చెనమోని రాములు, నాయకులు కళ్యాణ్‌నాయక్, బెజవాడ శేఖర్, గుండాల అంజయ్య, నరేందర్‌రెడ్డి, రమేష్, సైదులు, గాజుల మురళి, బహదూర్‌సింగ్, అంజినాయక్ తదితరులున్నారు.

బీజేపీ గెలుపునకు కృషి చేయాలి

వేములపల్లి: వచ్చే ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ గెలుపునకు పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని ఉత్తర్రప్రదేశ్ రాష్ట్రంలోని ఘజియాబాద్ ఎమెల్యే అతుల్ గార్గే అన్నారు. సోమవారం వేములపల్లి మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తొమ్మిదేళ్ల పాలనలో సీఎం కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను బీజేపీ కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాధినేని శ్రీనివాస్‌రావు, నాయకులు గార్లపాటి జితేందర్‌రెడ్డి, రతన్‌సింగ్ నాయక్, చిర్ర సాంబమూర్తి, పుట్టల సందీప్, పెదమాం భరత్, రవి, సైదులు, ప్రసాద్, సత్యనారాయణ, దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

జిల్లాగా ప్రకటించాలని ప్రార్థనలు

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడను జిల్లాగా ప్రకటించాలని కోరుతూ తెలంగాణ మెన్స్, ఉమెన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం మిర్యాలగూడ పట్టణంలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సీఎం కేసీఆర్ త్వరగా మిర్యాలగూడను జిల్లాగా ఏర్పాటు చేసి ఈ ప్రాంత మరింత అభివృద్ధి పాటుపడాలని ప్రార్థించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు పాస్టర్ ధీరావత్ హన్యానాయక్, పాస్టర్లు ధీరావత్ రమాబాయి, సీహెచ్. జనార్దన్, జోసఫ్, పి. రాజు, సుధాకర్, దేవదానం తదితరులున్నారు.

చామలేడులో వైద్య శిబిరం

గుర్రంపోడు: మండలంలోని చామలేడు గ్రామానికి చెందిన వ్యక్తి జ్వరంలో బాధపడుతూ ఆదివారం నల్లగొండ జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చేరగా.. అతడికి డెంగీ సోకిందని వైద్య పరీక్షల్లో తేలింది. దీంతో చామలేడు గ్రామంలో సోమవారం వైద్యాధికారులు వైద్యశిబిరం ఏర్పాటు చేసి జ్వరంతో బాధపడుతున్న 13 మంది రక్తనమూనాలు సేకరించారు. గ్రామంలో పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలని, దోమల మందు పిచికారీ చేయాలని సర్పంచ్ చాడ చక్రవర్తికి సూచించారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి శ్రీపాద సుధాకర్, వైద్యాధికారి డాక్టర్ భవానీ చక్రవర్తి, సూపర్‌వైజర్ సైదులు పాల్గొన్నారు.

గ్రామాన్ని వేరు చేయొద్దు

చందంపేట: నేరెడుగొమ్ము మండలంలోని కాచరాజుపల్లి గ్రామం నుంచి సుద్దబావితండాను వేరు చేయొద్దని సుద్దబావితండా గ్రామస్తులు సోమవారం చందంపేట ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ బిక్కునాయక్ మాట్లాడుతూ.. ఇటీవల సుద్దబావితండాను నూతన గ్రామపంచాయతీగా ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారని, కొందరు రాజకీయ నాయకులు తమ స్వలాభం కోసం సుద్దబావితండాను వేరు చేయాలని చూస్తున్నారని ఆరోపించారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

పెద్దవూర: మండలంలోని చింతపల్లి గ్రామ పంచాయతీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం జెడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి శంకుస్థాపన చేసి మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ సుంకిరెడ్డి ప్రభావతీసంజీవరెడ్డి, ఉపసర్పంచ్ కాంసాని భారతీకొండల్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జటావత్ రవినాయక్, సుంకిరెడ్డి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పిస్తాం

త్రిపురారం: ఓటర్లు తమ ఓటు హక్కును సులభంగా వినియోగించుకునే విధంగా అన్ని పోలింగ్ కేంద్రాలలో వసతులు కల్పిస్తామని త్రిపురారం తహసీల్దార్ ప్రమీల అన్నారు. సోమవారం రెవెన్యూ సిబ్బందితో కలిసి మండల కేంద్రంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాలలో వసతులపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ సైదులు, త్రిపురారం పంచాయతీ కార్యదర్శి రాజేంద్ర కుమార్, రాజు, చందు తదితరులు ఉన్నారు.

నిత్యావసర సరుకులు అందించాలి

మిర్యాలగూడ అర్బన్: రేషన్ దుకాణాలలో అన్నిరకాల నిత్యావసర సరుకులు అందించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లు గౌతంరెడ్డి అన్నారు. సోమవారం మిర్యాలగూడ పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రేషన్ దుకాణాల ద్వారా ప్రభుత్వం కేవలం బియ్యం మాత్రమే ఇస్తుందని, కేరళ రాష్ట్రంలో మాదిరిగా తెలంగాణాలో కూడా అన్ని రకాల నిత్యావసర సరుకులు అందించాలని కోరారు. రేషన్ డీలర్లకు కమీషన్ పద్ధతిలో కాకుండా ప్రతి నెల రూ.30వేలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బంటు రామారావు, దిరావత్ రవినాయక్, ఎండీ పాషా, లింగయ్య తదితరులున్నారు.

పఠనా సామర్థ్యాలు పెంపొందించాలి

గుర్రంపోడు: విద్యార్థుల్లో పఠనా సామర్థ్యాలు పెంచేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని మండల విద్యాధికారి తరి రాము అన్నారు. సోమవారం గుర్రంపోడు మండలంలోని నడికూడ, ఆమలూరు, చామలేడు, పిట్టలగూడెం, వట్టికోడు, వెంకటాపురం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను ఆయన సందర్శించి విద్యార్థుల పఠనా సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులతో కథల పుస్తకాలు చదివించడం, సొంతంగా కథలు చెప్పించడం ద్వారా వారిలో పఠనా ఆసక్తి పెరుగుతుందని అన్నారు.

అర్హులకే పథకాలు అందజేయాలి

హాలియా: గృహలక్ష్మి, దళిత బంధు పథకాల అమలులో ప్రభుత్వం పారదర్శకత పాటించి నిజమైన లబ్ధిదారులకు మాత్రమే ఇవ్వాలని బహుజన సమాజ్ పార్టీ నాగార్జునసాగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదిమల్ల వెంకటేష్ డిమాండ్ చేశారు. సోమవారం హాలియా పట్టణంలో నిర్వహించిన బీఎస్పీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పాత బకాయిలకు సంబంధం లేకుండా రైతు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ మహిళా కన్వీనర్ బైరాగి విజయ, ఉపాధ్యక్షుడు బత్తుల ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ముదిగొండ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

చింతపల్లి: ప్రభుత్వ మోడల్ స్కూల్ హాస్టళ్లు, కస్తూర్బా గాంధీ బాలికల హాస్టళ్లలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం చింతపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. హాస్టళ్లలో పనిచేస్తున్న కార్మికులను ప్రభుత్వం పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఐదు నెలల బకాయిలను విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో శ్వేత, నల్లవెల్లి యాదయ్య, పల్లేటి సైదమ్మ, నల్ల వెల్లి విజయ, కోయిరాల భాగ్యమ్మ, కళమ్మ తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే ఇంట్లో చోరీ

చింతపల్లి: మండల పరిధిలోని కుర్రంపల్లి గ్రామంలో సోమవారం మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తులు ఓ ఇంట్లో ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. కుర్రంపల్లి గ్రామానికి చెందిన చిట్టగోని కృష్ణయ్య, అంజమ్మ దంపతులు సోమవారం ఉదయం ఇంటికి తాళం వేసి వ్యవసాయ పనుల నిమిత్తం పొలం వద్దకు వెళ్లగా.. మధ్యాహ్నం సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో ఉన్న తులం బంగారం, నాలుగు తులాల వెండి, రూ.30వేల నగదు దోచుకెళ్లారు. కృష్ణయ్య, అంజమ్మ దంపతులు సాయంత్రం ఇంటి వచ్చి చూసేసరి ఇంటికి వేసిన తాళం పగులగొట్టి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. ఈ ఘటనపై బాధితుడు కృష్ణయ్య కుమారుడు గిరి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

నేడు డయల్ యువర్ డీఎం

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 11గంటల నుంచి 12గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ బొల్లెద్దు పాల్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రయాణికులు, ప్రజలు 9959226308 నంబర్‌కు ఫోన్ చేసి తమ సమస్యలు, సలహాలు, సూచనలు తెలియజేవచ్చునని తెలిపారు.

అరుణాచలం పుణ్యక్షేత్రానికి ప్రత్యేక బస్సులు

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ ఆర్టీసీ డిపో నుంచి ప్రతి పౌర్ణమికి తమిళనాడులోని అరుణాచలం పుణ్యక్షేత్రానికి ప్రత్యేక బస్సులు నడిపించనున్నట్లు డిపో మేనేజర్ బొల్లెద్దు పాల్ అన్నారు. సోమవారం బస్టాండ్‌లోని ఆయన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 30వ తేదీ పౌర్ణమిని పురస్కరించుకొని ఉదయం 8గంటలకు మిర్యాలగూడ డిపో నుంచి సూపర్‌లగ్జరీ బస్సు బయల్దేరి, మార్గమధ్యలో కాణిపాకం మీదుగా అరుణాచలం చేరుకుంటుందని పేర్కొన్నారు. దైవ దర్శనం అనంతరం తిరుగు ప్రయాణంలో బస్సు వేలూరులోని గోల్డెన్ టెంపుల్ మీదుగా బయల్దేరి సెప్టెంబర్ 1వ తేదీన మిర్యాలగూడ డిపోకు చేరుకుంటుందన్నారు. ఆసక్తి గల వారు రూ.3400 చెల్లించి సీటు రిజర్వ్ చేయించుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9959226308, 9492179462, 900063425, 9441703008 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

దరఖాస్తుల పరిశీలన

అడవిదేవులపల్లి: మండల కేంద్రంలో గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఇళ్ల వద్దకు సోమవారం సర్వే అధికారులు వచ్చి దరఖాస్తులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి వాసుదేవారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల సంబురాలు

వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ అభ్యర్థులను సోమవారం ప్రకటించారు. దేవరకొండ, మిర్యాలగూడ, నాగార్జునసాగర్ నియోజకవర్గాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలైన రవీంద్రకుమార్, భాస్కర్‌రావు, నోముల భగత్‌కే మరోసారి టికెట్లు కేటాయించడంతో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆయా నియోజకవర్గాల పరిధిలోని మండలాల్లో బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ర్యాలీలు నిర్వహించారు. స్వీట్లు పంచి పెట్టారు.

– సాక్షి నెట్‌వర్క్



హాలియాలో ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



మిర్యాలగూడ: బాణాసంచా కాల్చి సంబురాలు చేసుకుంటున్న బీఆర్ఎస్ కార్యకర్తలు



కొండమల్లేపల్లి: సంబరాలు చేసుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు



పెద్దవూర: ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



చందంపేట: టపాసులు కాల్చి సంబరాలు చేసుకుంటున్న బీఆర్ఎస్ నేతలు

భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి

త్రిపురారం: మండలంలోని బాబుసాయిపేట రోడ్డులో కృషి విజ్ఞాన కేంద్రం కంపాసాగర్ సమీపంలో వెలసిన బంగారు మైసమ్మ రేణుకా ఎల్లమ్మ అమ్మవారు, నాగ దేవత ఆలయంలో సోమవారం నాగుల పంచమిని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి పుట్టకు పాలు పోసి నాగ దేవత విగ్రహానికి పూజలు చేశారు. బాబుసాయిపేట గ్రామంలోని మహిళలు బోనాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

సీఎం సహకారంతో మరింత అభివృద్ధి చేస్తా

- మిర్యాలగూడ ఎమ్మెల్యే భాస్కర్‌రావు



మిర్యాలగూడ: సీఎం కేసీఆర్ సహకారంతో మిర్యాలగూడ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. సోమవారం మిర్యాలగూడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి మరోసారి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేయడానికి అవకాశం కల్పించిన సీఎం కేసీఆర్‌కు తాను రుణపడి ఉంటానన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో చేపట్టిన అనేక అభివృద్ధి కార్యక్రమాలను త్వరలో పూర్తిచేస్తానన్నారు. రెండు రోజుల క్రితం మంత్రి కేటీఆర్ మిర్యాలగూడ నియోజకవర్గానికి మరో రూ.50కోట్లు విడుదల చేస్తూ జీఓ జారీ చేశారని.. ఆ నిధులను పట్టణాభివృద్ధికి వెచ్చించనున్నట్లు తెలిపారు. మరో రూ.85కోట్లకు ప్రతిపాదనలు పంపించామని, ఈ నిధులను వంతెనలు, రోడ్ల మరమ్మతులకు వినియోగిస్తామన్నారు. దామరచర్ల మండలంలో రూ.60కోట్ల వ్యయంతో దామరచర్ల–వీర్లపాలెం వరకు సీసీ రోడ్డు పనులను త్వరలో పూర్తిచేస్తామన్నారు. మూడోసారి నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదంతో తాను భారీ మెజారిటీతో గెలుస్తానని ఆశాభావం వ్యక్తం చేశారు. గెలిచిన తర్వాత సీఎం కేసీఆర్‌ను ఒప్పించి మిర్యాలగూడ జిల్లాను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానన్నారు.

ప్రజల సంక్షేమం, అభివృద్ధే ఎజెండా

- దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్



దేవరకొండ: వచ్చే ఎన్నికల్లో సంక్షేమం, అభివృద్ధే ఎజెండాగా ముందుకెళ్తానని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. సోమవారం సీఎం కేసీఆర్ దేవరకొండ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా తన పేరు ప్రకటించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. తనపై నమ్మకం ఉంచి మరోసారి పోటీ చేసేందుకు అవకాశం కల్పించిన సీఎం కేసీఆర్‌కి కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటివరకు దేవరకొండ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించి మరోసారి భారీ మెజార్టీతో తనను గెలిపించాలని ప్రజలను కోరనున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో ముఖ్యంగా తాగు, సాగునీటికి ప్రాధాన్యతనిచ్చి రిజర్వాయర్ల పనులు చేపట్టినట్లు తెలిపారు. పురోగతిలో ఉన్న అభివృద్ధి పనులు త్వరలోనే పూర్తిచేస్తామని వివరించారు.

సాయి దేవాలయంలో ఎమ్మెల్యే పూజలు

చింతపల్లి: దేవరకొండ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు సీఎం కేసీఆర్ మరోసారి టికెట్ కేటాయించడంతో సోమవారం ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్‌కు చింతపల్లి మండల కేంద్రంలోని సాయినాథుడి ఆలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కంకణాల వెంకట్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, నరేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అన్ని కులాల అభివృద్ధికి కేసీఆర్ కృషి

మండల పరిధిలోని గొడుకొండ్ల గ్రామంలో రూ.10లక్షలతో చేపడుతున్న గౌడ సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి, రూ.5లక్షలతో చేపడుతున్న మార్కండేయ కమిటీ హాల్ నిర్మాణానికి సోమవారం దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కంకణాల ప్రవీణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దొంతం చంద్రశేఖర్‌రెడ్డి, రైతు బంధు అధ్యక్షుడు ఉజ్జిని విద్యాసాగర్‌రావు, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు గున్‌రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, గోపిడి కిష్టారెడ్డి, ఉజ్జిని నరేందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పించిన ఎమ్మెల్యే..

డిండి: మండలంలోని కామేపల్లి గ్రామానికి చెందిన మాధవరం మనోహర్‌రావు మృతి బాధాకరమని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. సోమవారం మనోహర్‌రావు మృతదేహానికి ఎమ్మెల్యే నివాళులర్పించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆర్‌వీఆర్, శ్రీనివాసరావు, జంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మరోసారి గులాబీ జెండా ఎగురవేస్తాం

- నాగార్జునసాగర్ ఎమ్మెల్యే భగత్



హాలియా: నాగార్జునసాగర్ నియోజకవర్గంలో వరుసగా రెండోసారి గులాబీ జెండా ఎగురవేస్తామని ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. నాగార్జునసాగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా సోమవారం సీఎం కేసీఆర్ రెండోసారి తనకు టికెట్ కేటాయించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. తనకు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చినందుకు సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, జగదీష్‌రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గడిచిన తొమ్మిదిన్నర ఏళ్లలో సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ కార్యక్రమాలను నియోజకవర్గంలో ఇప్పటికే ప్రతి గడపకు తీసుకెళ్లానని పేర్కొన్నారు. తాను ఎమ్మెల్యేగా గత రెండు సంవత్సరాల కాలంలో నియోజకవర్గ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేశానన్నారు. ఈసారి కూడా నియోజకవర్గంలో తన గెలుపు నల్లేరు మీద నడకే అని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పాలన, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, నియోజకవర్గ అభివృద్ధికి తాను చేసిన కృషే తనను గెలిపిస్తాయన్నారు. నాగార్జునసాగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ నాయకులు గులాబీ జెండాను ఎగురవేసేందుకు సైనికుడిలా పనిచేయాలని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ పార్టీతోనే ప్రజలకు భరోసా

గుర్రంపోడు: బీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతిపై పోరాడి ప్రజలకు ధైర్యం, భరోసా కల్పించడం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి అన్నారు. సోమవారం రాత్రి గుర్రంపోడు మండలంలోని తెరాటిగూడెం గ్రామంలో పలువురు జానారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకుడు కుందూరు జయవీర్‌రెడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కంచర్ల వెంకటేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తగుళ్ల సర్వయ్య, జగదీశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జానారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న తెరాటిగూడెం గ్రామస్తులు

పీఆర్‌టీయూతోనే సమస్యలు పరిష్కారం

తిరుమలగిరి(నాగార్జునసాగర్), పెద్దవూర: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం పీఆర్‌టీయూ టీఎస్‌తోనే సాధ్యమని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి భిక్షంగౌడ్ అన్నారు. సోమవారం తిరుమలగిరి సాగర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పెద్దవూరలోని పలు పాఠశాలల్లో పీఆర్‌టీయూ సభ్యత్వాల నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమాల్లో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కృష్ణారెడ్డి, శంకర్, కోర్ కమిటీ సభ్యులు వెంకట్‌రెడ్డి, వెంకన్న గౌడ్, ఆయా మండలాల బాధ్యులు మంకెన రామచంద్రారెడ్డి, టి.లక్ష్మీప్రభ, సుధాకర్, నోవ, వెంకన విజయ్, శ్రీను, శశిధర్‌రెడ్డి ,సంతోష్, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

మాల మహానాడు నూతన అధ్యక్షుల ఎన్నిక



నూతన సభ్యులకు నియామక పత్రాలు అందజేస్తున్న జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి

హాలియా: పట్టణంలో సోమవారం నిర్వహించిన మాల మహానాడు నాగార్జునసాగర్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి, జిల్లా అధ్యక్షుడు చింతపల్లి బాలకృష్ణ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సమావేశంలో మాల మహానాడు నియోజకవర్గ అధ్యక్షుడిగా రువ్వ వెంకటేశ్వర్లు, అనుముల మండల అధ్యక్షుడిగా బూరుగు వెంకటయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకొని నియామకపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గండమల్ల జానయ్య, రాష్ట్ర కార్యదర్శి జార్జి రవి, జిల్లా ప్రధాన కార్యదర్శి జంగయ్య, మహిళా అధ్యక్షురాలు పెయ్యాల గీత, హాలియా పట్టణ అధ్యక్షుడు మోటమర్రి సురేందర్, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.